సాక్షి ఒడిశా
మంగళవారం ׀ 7 ׀ మే ׀ 2024



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం సోమవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.4,17,650లు, బంగారం 4గ్రాముల 800 మిల్లీగ్రాములు, వెండి 54 గ్రాముల 500 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



ఐక్యతతోనే సమస్యల పరిష్కారం

ఐక్య పోరాటాలతో సమస్యలు పరిష్కామవుతాయని పలువురు నేతలు ఉద్ఘోదించారు.

- 8లో

కొరాపుట్ ఎంపీ బరిలో దినసరి కూలీ



కొరాపుట్ ఎంపీ స్థానానికి జరగనున్న ఎన్నికల బరిలో దినసరి కూలీ నిలబడ్డారు.

- 8లో

బీజేడీది నిర్లక్ష్య పాలన



పీఎం మోదీతో గంజాం జిల్లా బీజేపీ అభ్యర్థులు



ప్రధానమంత్రి మోదీకి శాంతమ్మవారు ఫొటో బహూకరిస్తున్న బీజేపీ నాయకులు

- కేంద్ర ప్రభుత్వ పథకాలు అమలు చేయడం లేదు
- ఒక్క అవకాశం ఇస్తే అభివృద్ధి ఏంటో చూపిస్తాం
- ఎన్నికల ప్రచారంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ

బరంపురం: రాష్ట్రంలో సీఎం నవీన్ పట్నాయక్ ఆధ్వర్యంలోని బీజేడీ ప్రభుత్వం నిర్లక్ష్యపు పాలన అందిస్తోందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆరోపించారు. సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో భాగంగా నగర శివారులోని కొనిసిలో సోమవారం జరిగిన బహిరంగ సభలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వ్యవసాయ ఆధారిత రాష్ట్రమైనా, కేంద్ర ప్రభుత్వ పథకాలను ఇక్కడి ప్రభుత్వం అమలు చేయడం లేదని మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగానే గంజాం జిల్లాలో రైతుల ఆత్మహత్యలు పెరిగాయని దుయ్యబట్టారు. ఈ జిల్లా నుంచి ముఖ్యమంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్నా ప్రజల జీవితాల్లో మార్పులు లేవన్నారు. నష్టపోయిన ఖరీఫ్ రైతుల రుణాలు మాఫీ చేయడంలో నిర్లక్ష్యం వహించడంతో ఇప్పటివరకు సుమారు 12 మందికి పైగా రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారన్నారు. ఆత్మహత్యలు చేసుకున్న రైతుల కుటుంబాలకు ఇప్పటివరకు నష్ట పరిహారం చెల్లించకపోవడంతో వారు రోడ్డునపడ్డారని అవేదన చెందారు. ఒడిశాలో అధికార బీజేడీ తీరు వలన రోజురోజుకి జిల్లాలో వ్యవసాయ రంగం కనుమరుగయ్యే భయానక పరిస్తితులు నెలకొన్నాయని ధ్వజమెత్తారు.

రాష్ట్రంలో బీజేపీ గాలి

బీజేడీ పాలనపై రాష్ట్ర ప్రజలు విసిగెత్తిపోయారని పీఎం నరేంద్రమోదీ అన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో బీజేపీ అనుకూల పవనాలు వీస్తున్నాయని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఒక్క అవకాశం ఇస్తే అభివృద్ధి అంటే ఎంటో చూపిస్తామని తెలియజేశారు. దేశానికి రాష్ట్రపతిగా ఒడిశాకి చెందిన మహిళ ద్రౌపది ముర్ము ఉండడం ఎంతో గర్వంగా ఉందన్నారు. ఒడిశా కళా, సంస్కృతులు ఎంతో గొప్పవని కొనియాడారు. ఖనిజ సంపదకు కొదవలేదని, 184 కిలోమీటర్ల సాగర తీర ప్రాంతముందని పేర్కొన్నారు. రానున్న ఎన్నికల్లో బీజేపీ ప్రభుత్వం వస్తే యువతకు ఉపాధి కల్పించేందుకు తానే స్వయంగా బాధ్యత తీసుకుంటానని వెల్లడించారు. కార్యక్రమంలో రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు మన్‌మోహన్ సామల్, బరంపురం బీజేపీ లోక్‌సభ అభ్యర్థి డా.ప్రదీప్ కుమార్ పాణిగ్రాహి, ఎమ్మెల్యే అభ్యర్థి కె.అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తున్న పీఎం నరేంద్ర మోదీ



బహిరంగ సమావేశంలో పాల్గొన్న ప్రజలు

రాష్ట్రంలో రానున్నది బీజేపీ ప్రభుత్వమే



కొరాపుట్: పీఎం మోదీకి జ్ఞాపిక బహుకరిస్తున్న మహిళలు



కొరాపుట్: సమావేశంలో పాల్గొన్న ప్రజానికం

కొరాపుట్: రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వమే వస్తుందని పీఎం నరేంద్రమోదీ దీమా వ్యక్తం చేశారు. నబరంగ్‌పూర్ జిల్లా చికిలి మైదానంలో సోమవారం జరిగిన భారీ బహిరంగ సభలో ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. ఈ విడత రాష్ట్రంలో డబుల్ ఇంజిన్ సర్కార్‌కు అవకాశం ఇవ్వాలని కోరారు. జూన్ 4వ తేదీన రాష్ట్రంలో బీజేడీ ప్రభుత్వానికి ఆఖరి రోజు అవుతుందని పేర్కొన్నారు. అదే నెల 10వ తేదీన రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం కొలువుదీరుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. తాను ఎన్నికల ప్రచారం చేయడానికి రాలేదని, ప్రమాణ స్వీకారానికి ఆహ్వానానికి వచ్చానని పేర్కొన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే క్వింటాల్ ధాన్యం ధర రూ.3,100 చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం రాయగడ, కొరాపుట్, నబరంగ్‌పూర్, మల్కన్‌గిరి, కలహండి జిల్లాల్లో బీజేపీ తరుపున పోటీ చేస్తున్న అభ్యర్థులను ప్రజలకు పరిచయం చేశారు.

న్యూస్‌రీల్

కాంగ్రెస్‌కు షాక్..!

- డీసీసీ అధ్యక్ష పదవికి బిజయ్ కుమార్ రాజీనామా

రాయగడ: జిల్లాలో కాంగ్రెస్ పార్టీకి భారీ షాక్ తగిలింది. ఆ పార్టీ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు బిజయ్ కుమార్ గొమాంగో పదవికి రాజీనామా చేశారు. ఈ మేరకు తన రాజీనామా పత్రాన్ని పీసీసీ అధ్యక్షుడు శరత్ కుమార్ పట్నాయక్‌కు పంపించారు. పార్టీలో తనకు సముచిత స్థానం కల్పించకపోవడంతో తాను రాజీనామా చేస్తున్నట్టు పేర్కొన్నారు. సార్వత్రిక ఎన్నికలు దగ్గర పడుతున్న నేపథ్యంలో ఆయన రాజీనామా పార్టీకి పెద్ద చిక్కులు తెచ్చిపెట్టిందని విశ్లేషకులు భావిస్తున్నారు. గుణుపూర్‌కు చెందిన బిజయ్ కుమార్ గొమాంగో పార్టీలో సీనియర్ నాయకుడు. రాయగడ జిల్లా పరిషత్ ఏర్పాటైన తర్వాత జరిగిన జిల్లా పరిషత్ ఎన్నికల్లో ఆయన కాంగ్రెస్ నుంచి పోటీచేసి విజయం సాధించారు. అనంతరం ఆయన జిల్లా పరిషత్ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. పార్టీలో కీలక పాత్ర పోషించిన ఆయన కొన్నాళ్లు పార్టీకి దూరంగా ఉండేవారు. గతేడాది ఆయన తిరిగి పార్టీలో చురుగ్గా పాల్గొనడంతో గుర్తించిన అధిష్టానం ఆయనను డీసీసీ అధ్యక్షునిగా నియమించింది. ఈ క్రమంలో ఈ సార్వత్రిక ఎన్నికల్లో గుణుపూర్ నుంచి తన భార్య కేతకి, తనయుడు అవినాష్ గొమాంగోకు శాసనసభ, కొరాపుట్ లోక్‌సభ స్థానాల గురించి పోటీ చేసేందుకు టిక్కెట్టు ఇవ్వాలని అధిష్టానానికి ప్రతిపాదనలు పంపించారు. అయితే అందుకు ససేమిరా గుర్తించని కాంగ్రెస్ అధిష్టానం గుణుపూర్ శాసనసభ నియోజకవర్గం నుంచి పోటీ చేసేందుకు సత్యజీత్ గొమాంగోకు టిక్కెట్టు కేటాయించింది. దీంతో నిరాశకు గురైన గొమాంగో పార్టీ కార్యకలాపాలకు దూరంగానే ఉంటుండేవారు. ఈ నేపథ్యంలో తన కొడుకు అవినాష్ పార్టీకి రాజీనామా చేసి గుణుపూర్ శాసనసభ నుంచి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసేందుకు రంగంలోకి దిగారు. దీంతో ఆయన కాంగ్రెస్ కార్యకలాపాలకు పూర్తిగా దూరంగా ఉన్నారు. ఎట్టకేలకు సోమవారం ఆయన డీసీసీ పదవికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు.

గుణుపూర్ బీజేడీ పరిశీలకుడి నియామకం

నిషికాంత్ ప్రధాన్

రాయగడ: జిల్లాలోని గుణుపూర్ శాసనసభ నియోజకవర్గం కోసం బీజేడీ ఎన్నికల పరిశీలకుడిని నియమించింది. రాష్ట్ర ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ ఆదేశానుసారం ఆ పార్టీ సీనియర్ నాయకుడు నిషికాంత్ ప్రధాన్‌ను గుణుపూర్ విధానసభ ఎన్నికల పరిశీలకునిగా నియమిస్తున్నట్లు శంఖ భవనం నుంచి ఆదేశాలు జారీ అయ్యాయి. జిల్లా బీజేడీ అధ్యక్షునిగా ఉండే సుధీర్ దాస్‌ను ఆ పార్టీ రాష్ట్ర శాఖ ప్రధాన కార్యదర్శిగా నియమించడంతో పాటు నెక్కంటిని బీజేడీ జిల్లా అధ్యక్షుడిగా నియమించింది. ఈ క్రమంలో రాయగడ శాసనసభ నియోజవర్గం ఎన్నికల ఇన్‌చార్జిగా కృష్ణ మహాపాత్రోను నియమించిన అధిష్టానం, గుణుపూర్‌లో పార్టీ బలోపేతానికి పరిశీలకునిగా ప్రధాన్‌ను నియమించింది.

8 మంది కాంగ్రెస్ నాయకుల బహిష్కరణ

- ఆరేళ్ల పాటు సస్పెండ్

రాయగడ: పార్టీ నియమనిబంధనలను ఉల్లంఘించినందుకు జిల్లాలోని ఎనిమిది మంది కాంగ్రెస్ సీనియర్ నాయకులను పార్టీ ఆరేళ్ల పాటు బహిష్కరించింది. పార్టీ కార్యకలాపాలకు వ్యతిరేకంగా పనిచేస్తున్నారన్న ఆరోపణలపై భాస్కరజగరంగ, అవినాష్ గొమాంగో, చంద్రశేఖర్ బెహర, అశోక్ ఆచార్య, నీలమాధవ్ ఉలక, రామాయ్ త్రిపాఠి, పూర్ణ చంద్ర మాఝి, రాజేంద్ర నాయక్‌లపై క్రమశిక్షణ చర్యల్లో భాగంగా ఆరేళ్ల పాటు పార్టీ నుంచి బహిష్కరిస్తున్నట్లు పీసీసీ అధ్యక్షుడు శరత్ పట్నాయక్ సోమవారం ఒక ప్రకటనలో వెల్లడించారు.

ఝార్సుగూడలో సీఎం ఛాపర్ అత్యవసర ల్యాండింగ్

భువనేశ్వర్: ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్, 5టీ చైర్మన్ వి.కార్తికేయ పాండియన్ ప్రయాణిస్తున్న హెలికాప్టర్ కాలవైశాఖి కారణంగా భువనేశ్వర్‌లో ల్యాండ్ కాలేకపోయింది. ఝార్సుగుడలో అత్యవసరంగా ల్యాండ్ అయింది. మధ్యాహ్నం 3 నుంచి 3.30 గంటల ప్రాంతంలో భువనేశ్వర్ ప్రాంతంలో వాయువ్య ప్రేరేపిత కాలవైశాఖి వర్షం, బలమైన గాలి వీయడంతో ఈ పరిస్థితి నెలకొంది. దీంతో సుమారు 30 నిమిషాలు పాటు గాలిలో గింగుర్లు కొట్టింది. కలహండి జిల్లా భవానీపట్న, నువాపడా జిల్లా ఖరియార్‌లో మారథాన్ ప్రచారానికి వచ్చిన సీఎం నవీన్ పట్నాయక్ హెలికాప్టర్ సోమవారం ఝార్సుగూడ వీర్ సురేంద్ర సాయి విమానాశ్రయానికి మళ్లించాల్సి వచ్చింది. అక్కడి నుంచి దాదాపు 20 నిమిషాల తర్వాత బయల్దేరారు.

ఏడుగురిపై క్రిమినల్ కేసులు

- నాలుగు లోక్ సభ స్థానాల్లో 37 మంది పోటీ
- ఈ నెల 13న తొలి దశ పోలింగ్

భువనేశ్వర్: రాష్ట్రంలో మొదటి దశ లోక్ సభ ఎన్నికలకు పోటీలో ఉన్న 37 మంది అభ్యర్థుల్లో ఏడుగురి (19 శాతం)పై క్రిమినల్ కేసులు పెండింగ్‌లో ఉన్నాయని ప్రజాస్వామ్య సంస్కరణ సంఘం (ఏడీఆర్) ప్రకటించింది. ఇందులో ఆరుగురు (16 శాతం) అభ్యర్థులపై తీవ్రమైన క్రిమినల్ కేసులు ఉన్నాయని ఇటీవల విడుదల చేసిన నివేదికలో పేర్కొంది. తొలి దశ ఎన్నికల బరిలో ఉన్న 37 మంది అభ్యర్థుల్లో ఏడుగురు మాత్రమే మహిళలు. మే 13న మొదటి దశలో పోలింగ్ జరగనున్న రాష్ట్రంలో 4 పార్లమెంట్ నియోజకవర్గాల్లో పోటీ చేస్తున్న మొత్తం 37 మంది అభ్యర్థుల స్వీయ ప్రమాణ పత్రాలను ఒడిశా ఎలక్షన్ వాచ్, ప్రజాస్వామ్య సంస్కరణ సంఘం (ఏడీఆర్) విశ్లేషించింది. బరిలో ఉన్న 37 మంది లోక్ సభ అభ్యర్థుల నేర, ఆర్థిక, ఇతర నేపథ్య వివరాలను ఏడీఆర్ విశ్లేషించింది. బరంపురం, నవరంగ్‌పూర్, కలహండి, కొరాపుట్ పార్లమెంట్ స్థానాలు, ఈ నియోజకవర్గాల పరిధిలోని 28 అసెంబ్లీ స్థానాలకు మే 13న ఏకకాలంలో జరిగే పోలింగ్‌లో ఓటర్లు పాల్గొంటారు. ఏడీఆర్ విశ్లేషణ ప్రకారం 75 శాతం మంది బీజేపీ అభ్యర్థులు క్రిమినల్ కేసులలో విచారణను ఎదుర్కొంటున్నారు. 50 శాతం బీజేడీ, 25 శాతం మంది కాంగ్రెస్ అభ్యర్థులపై నాలుగు పార్లమెంట్ నియోజకవర్గాలలో క్రిమినల్ కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. 14 మంది (38 శాతం) అభ్యర్థులు తమ విద్యార్హత 5 నుంచి 12 తరగతుల మధ్య ఉత్తీర్ణత సాధించినట్లు ప్రకటించగా, 22 మంది (59 శాతం) అభ్యర్థులు తాము గ్రాడ్యుయేట్లు అని ప్రకటించారు. ఒక అభ్యర్థి తాను కేవలం అక్షరాస్యుడునని మాత్రమేనని ప్రకటించుకున్నారు. 10 (27 శాతం) మంది అభ్యర్థులు తమ వయస్సు 25 నుంచి 40 సంవత్సరాల మధ్య ఉన్నట్లు ప్రకటించగా, 23 (62 శాతం) మంది అభ్యర్థులు 41 నుంచి 60 సంవత్సరాల వయస్సు గలవారు. 61, 70 సంవత్సరాల మధ్య వయస్సు గల అభ్యర్థులు 4 (11 శాతం) మంది ఉన్నారు.

పది ఫలితాల్లో.. బాలికలదే హవా

- పదిలో 99.08 శాతం, 12వ తరగతిలో 98.90 శాతం ఉత్తీర్ణత

భువనేశ్వర్: రాష్ట్రంలో ఐసీఎస్ఈ 10వ తరగతి, ఐఎస్‌సీ 12వ తరగతి పరీక్షల్లో బాలికలు సత్తాచాటారు. ఈ ఫలితాలు సోమవారం వెలువడ్డాయి. పదో తరగతిలో 99.08 శాతం, 12వ తరగతిలో 98.90 శాతం ఉత్తీర్ణత నమోదు చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా 12వ తరగతి పరీక్షకు 33 పాఠశాలల నుంచి 1,726 మంది విద్యార్థులు హాజరయ్యారు. 10వ తరగతి పరీక్షల్లో ఒడిశా వ్యాప్తంగా 93 పాఠశాలల నుంచి 8,739 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. ఐసీఎస్ఈ 10వ తరగతి బాలురు సాధించిన 98.86 శాతం కాగా 99.34 శాతం ఉత్తీర్ణతతో బాలికలు ఆధిపత్యం చెలాయించారు. ఐఎస్‌సీ 12వ తరగతి బాలికలు 98.95 శాతం, బాలురు 98.85 శాతం ఉత్తీర్ణత పొందారు. నగరంలో లయోలా స్కూల్ సైన్స్ స్ట్రీమ్‌లో సుమిత్ మిశ్రా, దివ్యాంశు కొరొ అత్యధికంగా 93.5 శాతం స్కోరు సాధించగా, కామర్స్ స్ట్రీమ్‌లో ఏంజెల్ మహంతి 89.25 శాతం, ఆర్ట్స్ స్ట్రీమ్‌లో శ్రద్ధాంజలి స్వంయి 93.25 శాతం ఉత్తీర్ణతతో సత్తాచాటారు. టాపర్ల పేర్లను కౌన్సిల్ ఐసీఎస్ఈ, ఐఎస్‌సీ ప్రకటించలేదు.

పోలీసుల ఫ్లాగ్‌మార్చ్



ఫ్లాగ్‌మార్చ్‌లో పోలీసులు

జయపురం: సార్వత్రిక ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు వీలుగా పోలీసులు చర్యలు చేపడుతున్నారు. శాంతిభద్రతలపై ప్రత్యేక దృష్టిసారించారు. కొరాపుట్ జిల్లాలో పోలింగ్ స్వేచ్ఛగా జరిగేందుకు కృషి చేస్తున్నారు. ఇందులో భాగంగా స్థానిక పోలీసులు, బీఎస్ఎఫ్ జవాన్లు సంయుక్తంగా జయపురంలో సోమవారం ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ప్రజల్లో ధైర్యాన్ని నింపేందుకు ఫ్లాగ్‌మార్చ్ చేపట్టినట్టు పోలీసు అధికారులు వెల్లడించారు. ప్రశాంత వాతావరణంలో ఓట్లు వేయాలని కోరారు. ఫ్లాగ్ మార్చ్ జయపురం పట్టణ పోలీసు స్టేషన్ నుంచి బయలు దేరి మెయిన్‌రోడ్డు, తరణి జంక్షన్, సునారివీధి, రాజువీధి, కొత్తవీధి, గొడవీధి, టౌన్‌హాల్ మీదుగా తిరిగి పోలీసుస్టేషన్ వద్దకు చేరుకుంది. పట్టణ పోలీసు అధికారి రశ్మి రంజన్ దొలాయ్ నేతృత్వంలో స్థానిక పోలీసులతో పాటు మూడు బెటాలియన్ల బీఎస్ఎఫ్ జవాన్లు పాల్గొన్నారు.



ఫ్లాగ్‌మార్చ్‌లో బీఎస్ఎఫ్ జవాన్లు

నాటుసారా బట్టీలపై ఎక్సైజ్ దాడులు



స్వాధీనం చేసుకున్న సామగ్రితో ఎక్సైజ్ అధికారులు

బరంపురం: కొందమాల్ జిల్లా పరిధిలో అక్రమంగా నడుస్తున్న రెండు వేర్వేరు నాటుసారా బట్టీలపై ఎక్సైజ్ అధికారులు దాడులు చేపట్టి 2,600 లీటర్ల నాటుసారా ధ్వంసం చేశారు. ఎక్సైజ్ అధికారులు తెలిపిన వివరాల మేరకు.. సోమవారం ఉదయం కొందమాల్ జిల్లా ఫుల్బణి పోలీసుస్టేషన్ పరిధి గుడారిలోని ఇందిరాక్కి గ్రామ శివారులోని దట్టమైన అటవీ ప్రాంతంలో అక్రమంగా తయారు చేస్తున్న నాటుసారా బట్టీలపై ఎక్సైజ్, పోలీసు అధికారులు దాడులు నిర్వహించారు. అదేవిధంగా కె.నువాగం పోలీసుస్టేషన్ పరిధి చికిటి పెంట శివారు అటవీ ప్రాంతంలో నాటుసారా బట్టీపై సైతం దాడులు చేపట్టారు. దాడుల్లో సుమారు 2,600 లీటర్ల నాటుసారా ధ్వంసం చేయడంతో పాటు తయారీకి ఉపయోగించే సామగ్రి స్వాధీనం చేసుకున్నారు.



ఫుల్బణిలో నాటుసారా ధ్వంసం చేస్తున్న దృశ్యం

వర్షాతిరేకం..!

గత కొన్ని రోజులుగా ఉక్కపోతతో సతమతమవుతున్న పట్టణ ప్రజలకు సోమవారం కురిసిన వర్షంతో ఉపశమనం కలిగింది. మధ్యాహ్నం ఉరుములు, మెరుపులతో కురిసిన వర్షంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు. ఏడతెరిపి లేకుండా కురిసిన వర్షం వలన లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. దీంతో రాకపోకలకు అంతరాయం కలిగింది.

– బరంపురం



ఇంజనీర్ స్కూల్ రోడ్‌లో రాకపోకలకు అంతరాయం



ఫైర్ స్టేషన్ రోడ్‌లో కురుస్తున్న కుండపోత వర్షం



హౌసింగ్ బోర్డు కాలనీలో కురుస్తున్న వర్షం



జలమయమైన కొమ్మపల్లి రోడ్డు

క్లుప్తంగా

భూపేష్ బఘేల్ పర్యటన రేపు



రాయగడ: ఈనెల 8వ తేదీన పొరుగు రాష్ట్రమైన ఛత్తీస్‌ఘడ్ మాజీ ముఖ్యమంత్రి భూపేష్ బఘేల్ జిల్లాలోని కాసీపూర్‌లో పర్యటించనున్నారు. కొరాపుట్ లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేస్తున్న సప్తగిరి ఉలక, రాయగడ విధానసభ నుంచి పోటీ చేస్తున్న అప్పల స్వామి కద్రకలకు మద్దతివ్వాలని కోరుతూ కాసీపూర్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నారు. ఆరోజు ఉదయం 9 గంటలకు రాయిపూర్ నుంచి ప్రత్యేక హెలీకాప్టర్ ద్వారా బయల్దేరి ఉదయం 10 గంటలకు కాసీపూర్ చేరుకుంటారు. అక్కడ జరగనున్న బహిరంగ సభలో పాల్గొని ప్రసంగిస్తారు. అనంతరం మధ్యాహ్నం 12 గంటలకు కాసీపూర్ నుంచి బయల్దేరి లంజిఘడ్ చేరుకుంటారు. 12.15 గంటలకు లంజిఘడ్‌లో జరిగే సభలో ప్రసంగిస్తారు. మధ్యాహ్నం 1.40 గంటలకు కలహండి జిల్లా జున్నాఘడ్ చేరుకొని అక్కడ జరిగే బహిరంగ సభలో ప్రసంగిస్తారు.

ఖాళీ బిందెలతో నిరసన

- చిత్రకొండ సమితి కార్యాలయం ముట్టడి



కార్యాలయం వద్ద ఖాళీ బిందెలతో మహిళలు

మల్కన్‌గిరి: చిత్రకొండ సమితి కార్యాలయాన్ని మహిళలు సోమవారం ఖాళీ బిందెలతో ముట్టడించారు. తాగునీటి సమస్య పరిష్కరించాలని నినాదాలు చేశారు. చిత్రకొండలో దుర్గా మందిరం వద్ద ఆరేళ్లుగా మంచినీటి ప్రాజెక్ట్ పనులు చేపడుతున్నారని, కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నారని, అయినా ఇప్పటివరకు మంచి నీటి సమస్య తీరలేదన్నారు. జిల్లా కలెక్టర్, అధికారులు, స్థానిక ఎమ్మెల్యే దృష్టికి తమ సమస్య తీసుకువెళ్లినా ఎవరూ పట్టించుకోవడం లేదని మహిళలు అన్నారు. చిత్రకొండ తహసీల్దార్ ప్రశాంత్ భత్రా, చిత్రకొండ ఐఐసీ ముఖుందో మెల్కా సమితి కార్యాలయం వద్దకు చేరుకుని మహిళలతో మాట్లాడి నచ్చజెప్పినా వారి మాటలు వినకుండా సాయంత్రం వరకు అక్కడే ఖాళీ బిందెలతోనే కూర్చున్నారు.

చెరువులో మునిగి వ్యక్తి మృతి



ప్రకాష్ బారిక్ మృతదేహం

మల్కన్‌గిరి: స్నానం కోసం చెరువులోకి దిగిన వ్యక్తి ప్రమాదవశాత్తు మునిగి ప్రాణాలు కోల్పోయాడు. ఈ సంఘటన మల్కన్‌గిరి జిల్లా బలిమెల ఎన్‌ఏసీ పరిధి చితపరి గ్రామంలో చోటుచేసుకుంది. చితపరి గ్రామానికి చెందిన ప్రకాష్ బారిక్ (32) సమీపంలోని చెరువుకు రోజూ స్నానం కోసం వెళ్లడం అలవాటు. సోమవారం ఉదయం కూడా చెరువుకు వెళ్లగా.. ప్రమాదవశాత్తు కాలుజారి నీటిలో పడిపోవడంతో అందులో మునిగిపోయాడు. సమీపంలో ఉన్నవారు గమనించి బయటకు తీసి బలిమెల ఆరోగ్య కేంద్రానికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ప్రకాష్ బారిక్ మరణించినట్టు నిర్ధారించారు. బలిమెల పోలీసుస్టేషన్ ఎస్‌ఐ మనోహర్ సాహు కేసు నమోద్ చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

ముగ్గురు జూదరుల అరెస్ట్

మల్కన్‌గిరి: బలిమెల ఎన్‌ఏసీ పరిధిలోని ఎం.వి 104 గ్రామంలో ఆదివారం రాత్రి బలిమెల పోలీసులు ముగ్గురు జూదరులను పట్టుకుని అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ.3320 నగదు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి సోమవారం కోర్టులో హాజరుపరిచారు. ఎం.వి 108 గ్రామం వద్ద జుదం అడుతున్నట్లు తెలిసుకుని దాడి చేశారు. జుదగాళ్లు పారార్ అయ్యారు. శిబిరం వద్ద రూ.6,355 నగదు స్వా.దీనం చేసుకున్నారు. నిందితుల కోసం పోలీసులు గాలిస్తున్నారు.

రానున్న 5 రోజులు వర్షాలు

భువనేశ్వర్: రానున్న 5 రోజులు రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వాతావరణం అలముకుంటుందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) ప్రాంతీయ కేంద్రం సోమవారం జారీ చేసిన ప్రకటనలో తెలిపింది. బంగాళాఖాతం నుంచి దిగువ స్థాయి తేమతో కూడిన గాలులతో మోస్తరు పొడి, పశ్చిమ గాలుల మధ్య పరస్పర చర్య కారణంగా ఈదురుగాలులతో కూడిన ఉపరితల గాలులతో మెరుపులు, మోస్తరు ఉరుములు, వడగండ్లు, భారీ వర్షం వాతావరణ పరిస్థితులకు అనుకూలిస్తుంది. దీని ప్రభావంతో పలు జిల్లాల్లో విస్తారంగా వర్షాలు కురుస్తాయి. మంగళవారం నాడు మెరుపులు, ఉరుములతో కూడిన ఉపరితల గాలి వేగం గంటకు 40 నుండి 50 కి.మీలకు చేరుకుంటుంది. గంజాం, నయాగఢ్, ఖుర్దా, పూరీ జిల్లాల్లో వడగండ్లు కురిసే అవకాశం ఉంది. అలాగే బాలాసోర్, భద్రక్, జాజ్‌పూర్, కేంద్రాపడా, కటక్, జగత్‌సింగ్‌పూర్, గజపతి, కెంజొహార్, మయూర్‌భంజ్, ఢెంకనాల్, కంధమల్, కొరాపుట్, రాయగడ, కలహండి, నవరంగపూర్ జిల్లాల్లో ఒకటి లేదా రెండు చోట్ల గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో గాలులతో వర్షం కురిసే అవకాశం ఉంది.

జోరుగా ఎన్నికల ప్రచారం

- దూసుకుపోతున్న కాంగ్రెస్, బీజేడీ, బీజేపీ అభ్యర్థులు



ప్రచారంలో బీజేడీ అభ్యర్థి అనసూయా మాఝి



టికిరిలో ప్రచారం చేస్తున్న బీజేపీ నాయకులు



కాశీపూర్‌లో కాంగ్రెస్ శ్రేణుల ప్రచారం

రాయగడ:

ఎన్నికల సమయం సమీపిస్తుండడంతో అన్ని పార్టీలు ప్రచారాన్ని ముమ్మరం చేశాయి. ఈ నెల 13వ తేదీన జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా అత్యంత ప్రతిష్టాత్మకంగా మారిన రాయగడ శాసనసభ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న అధికార, ప్రధాన ప్రతిపక్ష పార్టీలు పోటాపోటీగా ప్రచారాన్ని కొనసాగిస్తున్నాయి. ప్రచారానికి మరో ఐదు రోజులే గడువుఉన్న నేపథ్యంలో ఆయా పార్టీల నాయకులు ప్రచారాన్ని మరింత జోరుగా కొనసాగిస్తున్నారు. ఈ నియోజకవర్గం నుంచి బీజేడీ పార్టీ తరఫున అనసూయా మాఝి, కాంగ్రెస్ నుంచి అప్పల స్వామి కద్రక, బీజేపీ నుంచి బసంత కుమార్ ఉలకలు ప్రచారంలో నిమగ్నమయ్యారు. నియోజకవర్గంలో అత్యంత కీలకమైన ప్రాంతంగా గుర్తించిన కాశీపూర్ సమితిలో హోరాహోరీగా ప్రచారం చేస్తున్నారు. బీజేపీ, కాంగ్రెస్ శ్రేణులు సోమవారం టికిరి, కాశీపూర్ ప్రాంతాల్లో తమదైన శైలిలో ప్రచారాన్ని కొనసాగించగా.. అధికార బీజేడీ పార్టీకి చెందిన అనసూయా మాఝి తరఫున ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు నెక్కంటి భాస్కరరావు నేతృత్వంలో పట్టణంలోని వివిధ వార్డుల్లో ప్రచారాన్ని చేశారు.

నువ్వా.. నేనా..

ఈసారి ఎన్నికలు నువ్వా..నేనా అన్నట్టుగా ఉన్నాయి. ఈ నియోజకవర్గంలో కాంగ్రెస్, అధికార బీజేడీ పార్టీల మధ్య రసవత్తరమైన పోటీ జరగనుంది. 2019లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఈ రెండు పార్టీల మధ్యే పోటీ నెలకొనగా ఈసారి కూడా అదే తరహాలో కొనసాగుతుంది. జనాదరణ గల బీజేడీ ఈసారి రాయగడ శాసనసభ స్థానాన్ని గెలుపొందాలని ప్రయత్నిస్తుంది.

తెలుగు ఓటర్లను ఆకర్షించేలా..

రాయగడ నియోజకవర్గంలోని తెలుగు ఓటర్లను ఆకట్టుకునేలా బీజేడీ, కాంగ్రెస్ పార్టీలు ప్రయత్నిస్తున్నాయి. ఇప్పటికే కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్ర డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కను రప్పించి ప్రచారం చేసింది. త్వరలో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో కూడా ప్రచారం చేసేందుకు సన్నహాలు చేస్తుంది. ఇక అధికార బీజేడీ పార్టీ తెలుగు రాష్ట్రాల నాయకులపై ఆధారపడకుండా నెక్కంటి తన వ్యూహాత్మకంగా చక్రం తిప్పుతున్నారు. పట్టణంలోని అన్ని తెలుగు, ఇతర సంఘాల ప్రతినిధులతో ఇప్పటికే భేటి అయ్యి మద్దతును కోరారు. బీజేపీ నాయకులు త్రిపుర మాజీ సీఎం విప్లవ్‌కుమార్ దేవ్‌ను తీసుకువచ్చి ప్రచారాన్ని కొనసాగించినా అంత ప్రభావం చూపలేదు. అయితే ఈ నెల ఎనిమిదో తేదీన కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ రాయగడలో ఎన్నికల ప్రచారాన్ని చేపట్టనున్నారు.

నిబంధనలపై ఫిర్యాదులు

ఎన్నికల నిబంధనలు తుంగలో తొక్కాయని కాంగ్రెస్ పార్టీ ఆరోపించింది. ఈ మేరకు సోమవారం ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసింది. అధికార బీజేడీ, బీజేపీ నాయకులు ఎన్నికల నియమాలను ఉల్లంఘించి ప్రభుత్వ స్థలాల్లో పార్టీ జెండాలు, బ్యానర్లు ఏర్పాటు చేసారని ఫిర్యాదులో పేర్కొన్నారు.

కొరాపుట్ ఎంపీ బరిలో దినసరి కూలీ



ప్రమీల పూజారి

జయపురం: కొరాపుట్ ఎంపీ స్థానానికి జరగనున్న ఎన్నికల బరిలో దినసరి కూలీ నిలబడ్డారు. ఎన్నికలంటే డబ్బుతో పని. కానీ ఆమె దీన్ని పట్టించుకోకుండా ఎన్నికల్లో పోటీ చేస్తున్నారు. ప్రజా సేవ చేయాలన్నదే తన ధ్యేయమని చెబుతున్నారు. సోషలిస్టు యూనిటీ ఆఫ్ సెంటర్ ఇండియా (కమ్యూనిస్టు పార్టీ) అభ్యర్థిగా ప్రమీల పూజారి పోటీ చేస్తున్నారు. ఈమె బ్యాంక్‌లో దాచుకున్న 21,250 రూపాయలనే ఎన్నికల ప్రచారానికి ఖర్చు చేస్తానంటున్నారు. తాను ఎంపీ స్థానానికి పోటీ చేయడం సాహసంతో కూడికున్నదేనని, గెలిచే అవకాశం లేదన్నార. అయితే ఒక వేళ ప్రజలు ఆదరిస్తే ప్రస్తుతం ఉన్న రాజకీయ వ్యవస్థను మార్చేందుకు, ప్రజలకు కనీస మౌలిక సౌకర్యాలు కల్పించటం, ప్రజాస్వామ్య విలువలు కాపాడేందుకు పోరాటం చేస్తానని ఆమె వెల్లడించారు. నామినేషన్ వేసేటప్పుడు అయిన ఖర్చును ప్రతి ఇంటికి వెళ్లి చందాలు వసూలు చేసుకుంటున్నారు. అలాగే తనకు ఓటుతో పాటు ఎన్నికల ఖర్చుకు ఆర్థిక సహాయం కూడా చేయాలని ప్రజలను కోరుతున్నారు. తాను రోజు కూలీగా పనిచేస్తూ తల్లిదండ్రులను పోషిస్తున్నానని ప్రమీల చెప్పారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు గడచినా నేటికీ గ్రామీణ ప్రాంతాలు అభివృద్ధికి నోచుకోలేని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామీం ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. వారికి భద్రత లేదు, మౌలిక సౌకర్యాలు లేవని ఆవేదన వ్యక్తం చేశారు. ఓట్లు అడిగే వారే తప్పా వారి బాధలు ఎవరికీ పట్టడం లేదని చెప్పార. దీన పరిస్థితిలో ఉన్న వారికి సేవ చేయాలనే ఉద్దేశంతో 2016లో ఎస్‌యూసీఐ (కమ్యూనిస్టు పార్టీ) విద్యార్థి సంఘటనలో చేరినట్టు పేర్కొన్నారు. అప్పటి నుంచి కూలి పనులు చేస్తూనే ఆ పార్టీలో క్రియాశీల కార్యకర్తగా ఉంటున్నానని వెల్లడించారు ఎస్‌యూసీఐ బ్లాక్ అధ్యక్షులు, కార్మిక సంఘ అధ్యక్షులు సూర్యనారాయణ బిశాయి సలహా మేరకు ఎన్నికల్లో పోటీ చేస్తున్నట్టు పేర్కొన్నారు. తనను గెలిపిస్తే గ్రామ ప్రాంతాలలో విద్య, వైద్య, మౌలి సౌకర్యాల కల్పన, మహిళా సాధికారత కోసం పోరాడుతానని చెప్పారు. పూరి గుడిసెలో తల్లిదండ్రులతో కలిసి నివసిస్తున్న ప్రమీల పూజారికి చాలామంది అండగా నిలుస్తున్నారు.

బీజేడీకి 140 స్థానాలు వస్తే.. రాజకీయ సన్యాసం తీసుకుంటా

- కాంగ్రెస్ అభ్యర్థి బిజయ కుమార్ పట్నాయక్



మాట్లాడుతున్న కాంగ్రెస్ అభ్యర్థి బిజయ కుమార్ పట్నాయక్

పర్లాకిమిడి: రానున్న ఎన్నికల్లో బీజేడీ రాష్ట్రంలో 140 స్థానాల్లో గెలిపొందితే తాను రాజకీయ సన్యాసం చేస్తానని పర్లాకిమిడి కాంగ్రెస్ అభ్యరి, శాసనసభ మాజీ ప్రధాన కార్యదర్శి బిజయ పట్నాయక్ సవాల్ చేశారు. స్థానిక గజపతి స్టేడియం సమీపంలోని తన స్వగృహంలో సోమవారం విలేకరులతో మాట్లాడారు. తాను ముఖ్యమంత్రికి భయపడి భువనేశ్వర్ పారిపోయానని ప్రచారం చేయడం తగదన్నారు. గజపతి జిల్లాలో తీవ్ర తాగునీటి సమస్య ఉందని, దీనిపై ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ పర్లాకిమిడి ఎన్నికల పర్యటనకు విచ్చేసి ఏం మాట్లాడారని ప్రశ్నించాన్నారు. సీఎం నవీన్ పట్నాయక్, ఆయన వ్యక్తిగత కార్యదర్శి వి.కె. పాండ్యన్‌పై మండిపడ్డారు. గజపతి జిల్లాలో రోడ్లు, తాగునీటికోసం ప్రజలు అల్లాడుతుంటే సీఎం నవీన్ పట్నాయక్ పట్టించుకోవడం లేదన్నారు. విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు బసంత పండా ఉన్నారు.

ఐక్యతతోనే సమస్యల పరిష్కారం



సమావేశంలో పాల్గొన్న నాయకులు

జయపురం: ఐక్య పోరాటాలతో సమస్యలు పరిష్కామవుతాయని పలువురు నేతలు ఉద్ఘోదించారు. ఆదివారం సాయంత్రం స్థానిక బాబా సాహేబ్ కల్యాణ మండపంలో కొరాపుట్ జిల్లా గ్రామీణ డాక్ కర్మచారి మహాసంఘ 25వ వార్షిక సమావేశం జరిగింది. కొరాపుట్, నవరంగపూర్, మల్కనగిరి జిల్లాల నుంచి గ్రామీణ డాక్ ఉద్యోగులు పాల్గొన్నారు. భాస్కర పట్నాయక్ అధ్యక్షతన జరిగిన ఆ సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న గ్రామీణ డాక్ ఖర్మచారి కేంద్ర సంఘ కోశాధికారి నారాయణ చౌదరి ప్రసంగిస్తూ.. గ్రామీణ డాక్ సేవకులు వారి హక్కుల కోసం, ప్రభుత్వ ఉద్యోగులకు కల్పించే సకర్యాల సాధనకు సమైఖ్యంగా పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ముఖ్యవక్తగా జయపురం సిటీ కోఆర్డినేషన్ కమిటీ కార్యదర్శి, ప్రముఖ కార్మిక నేత ప్రమోద్ కుమార్ మహంతి మాట్లడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక చట్టాలు చేస్తూ వారి హక్కులను కాలరాస్తోందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ విధానాల వల్ల అనేక పరిశ్రమలు మూత పడుతున్నాయన్నారు. ఈ సందర్భంగా రెండేళ్ల కోసం సంఘం ఎన్నికలు నిర్వహించారు. సంఘం అధ్యక్షుడిగా జగదీష్ ఖరో, కార్యదర్శిగా మహేశ్వరరావు, కోశాధికారిగా కై లాస పట్నాయక్‌ను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో కృష్ణ చంద్రప్రధాన్, పరశురామ్ దాస్, శరత్ మాన్‌సింగ్, హిమాంశు దాస్, పూర్ణ చంద్ర మహారాణ, కల్పభట్ పట్నాయక్, నీలాంబర నాయిక్ తదితరులు ప్రసంగించారు

బీజేడీలో పలువురి చేరిక



బీజేడీలో చేరిన బీఎస్పీ నాయకులు, కార్యకర్తలు

రాయగడ: జిల్లాలోని కాసీపూర్ సమితి రెంగ పంచాయతీ పరిధిలోని బీఎస్పీకి చెందిన సీనియర్ నాయకులు, కార్యకర్తలు ఆ పార్టీని వీడి బీజేడీలోకి సోమవారం చేరారు. బీజేడీ జిల్లా అధ్యక్షుడు నెక్కంటి భాస్కరావు వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. బీజేడీ పార్టీ చేపడుతున్న ప్రజాహిత కార్యక్రమాలకు ఆకర్షితులై ఎంతో మంది చేరుతున్నారని నెక్కింటి అన్నారు. వారందరి సహకారంతో త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో బీజేడీ అధ్యధిక మెజార్టీతో గెలుపు సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేడీ సీనియర్ నాయకుడు, రాయగడ శాసనసభ నియోజవర్గం ఎన్నికల ఇన్‌చార్జి కృష్ణ మహాపాతో తదితరులు పాల్గొన్నారు.

పుస్తెలతాడు చోరీ

మెళియాపుట్టి: మండలంలోని జాడుపల్లి గ్రామంలో మహిళ ధరించిన పుస్తెలతాడును గుర్తు తెలియని వ్యక్తులు తెంచుకుపోయారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. జాడుపల్లి గ్రామానికి చెందిన మల్లారెడ్డి పద్మ సోమవారం మధ్యాహ్నం వంటకు కట్టెలు తీసుకురావడానికి వెళ్లింది. కట్టెలు తీసుకొనుండగా గ్రామ శివారులో గుర్తుతెలియని ఇద్దరు వ్యక్తులు ద్విచక్రవాహనంపై వచ్చి మహిళ మెడలో ఉన్న 2 తులాల బంగారు పుస్తలతాడు తెంచుకుని పలాస వైపు వెళ్లిపోయారు. బాధి తురాలు కేకలు వేసినా ఫలితం లేకపోయింది. పద్మ ఫిర్యాదు మేరకు ఎస్సై రాజేష్ కేసు నమోదు చేసి దర్యాప్తుచేస్తున్నారు. తూముకొండ పరిసర ప్రాంతంలో ఉన్న ఆకులమ్మ ఆలయం వద్ద సీసీ కెమెరాలు పరిశీలించారు.

ఇరు కుటుంబాల మధ్య ఘర్షణ

- మహిళకు గాయాలు



చికిత్సపొందుతున్న మిను అధికారి

మల్కన్‌గిరి: ఇరుకుటుంబాల మధ్య జరిగిన గొడవలో మహిళ గాయపడింది. ఈ సంఘటన మల్కన్‌గిరి జిల్లా కలిమెల సమితి కోయిమెట్ల పంచాయితీ ఎంపీవీ-33 గ్రామంలో చోటుచేసుకుంది. ఎంపీవీ-33 గ్రామంలో అడామ్ అధికారి, బిపుల్ సింగ్ కుటుంబాలు నివసిస్తున్నాయి. రెండు సంవత్సరాల క్రితం అడామ్ అధికారి కొడుకు బిపుల్ కుతూరును ప్రేమించి వివాహం చేసుకొని వెళ్లిపోయారు. అప్పటి నుంచి రెండు కుటుంబాల మధ్య వివాదం కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో ఆదివారం రాత్రి బిపుల్ కుటుంబ సభ్యులు అడామ్ అధికారి కొడుకు మాయ చేసి తమ బిడ్డను తీసుకొని వెళ్లిపోయాడని అన్నారు. దీంతో గొడవ ప్రారంభమైంది. మాటామాటా పెరిగి కొట్లాటకు దారితీసింది. ఈ ఘటనలో అమాడ్ అధికారి భార్య మీను అధికారికి గాయాలయ్యాయి. ఆమెను కలిమెల ఆరోగ్య కేంద్రానికి చికిత్స నిమిత్తం తరలించారు. ఈ ఘటనపై ఇరువర్గాలు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఆర్టీసీ డ్రైవింగ్ స్కూల్‌కు దరఖాస్తుల ఆహ్వానం

శ్రీకాకుళం అర్బన్: జిల్లాలో హెవీ వెహికల్ డ్రైవింగ్‌లో శిక్షణ పొందేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆర్టీసీ జిల్లా ప్రజారవాణా అధికారి ఎ.విజయకుమార్ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. లైట్ మోటార్ వెహికల్ లైసెన్స్(ఫోర్ వీలర్) ఉన్న అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు. ఆర్టీసీ డ్రైవింగ్ స్కూల్లో ఇప్పటివరకు 15 బ్యాచ్‌లకు గాను సుమారు 250 మంది డ్రైవర్లు విజయవంతంగా శిక్షణ పూర్తి చేసుకొని హెవీ లైసెన్స్ పొందారని తెలిపారు. ప్రస్తుతం 16వ బ్యాచ్‌కు అడ్మిషన్లు జరుగుతున్నాయని, 16 సీట్లు మాత్రమే ఉంటాయని చెప్పారు. శిక్షణతో పాటు మెకానికల్ వర్క్, యోగా, వ్యక్తిత్వ వికాసం, ప్రథమ చికిత్స, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పిస్తామని పేర్కొన్నారు. ఫీజు, ఇతర వివరాలకు 9963091999, 73829 23293 నంబర్లను సంప్రదించాలని కోరారు.

ప్రశాంతంగా ఐసెట్



విద్యార్థుల హాల్ టికెట్లు పరిశీలిస్తున్న దృశ్యం

ఎచ్చెర్ల క్యాంపస్: ఎంబీఏ, ఎంసీఏ ప్రవేశాలకు సంబంధించిన ఐసెట్ – 2024 ప్రవేశ పరీక్ష చిలకపాలెంలోని శ్రీశివానీ ఇంజినీరింగ్ కళాశాలలో రెండు షిఫ్టుల్లో సోమవారం జరిగింది. మొదటి షిఫ్టులో 120 మందికి 106 మంది, రెండో షిఫ్టులో 120 మందికి 113 మంది హాజరయ్యారు. ఐసెట్ అబ్జర్వర్లు పరీక్ష పర్యవేక్షించారు.

గాలివానతో చల్లదనం



రోడ్లపై కూలిన చెట్లు



జనావాసాల ప్రాంగణాల్లో కూలిన చెట్లను తొలగిస్తున్న సహాయ బృందాలు



వర్షం కురుస్తున్న దృశ్యం



దట్టంగా కమ్ముకున్న మబ్బులు

భువనేశ్వర్: గాలివానతో భువనేశ్వర్ నగరం చల్లబడింది. సోమవారం ఒక్కసారిగా వాతావరణంలో మార్పులు చోటుచేసుకున్నాయి. బలమైన గాలులతో కూడిన వర్షం కురిసింది. దీంతో వాతావరణం చల్లబడింది. నగరంలో పలు చోట్ల చెట్లు నేలకొరిగాయి. ప్రధాన రహదారుల గుండా వాహనాల రవాణాకు స్వల్ప అంతరాయం ఏర్పడింది. ప్రాణాపాయ పరిస్థితులు చోటుచేసుకోకున్న చాలా చోట్ల చెట్లు కూలి రహదారి దిగ్బంధానికి దారితీసిందని ప్రత్యేక సహాయ కమిషనరు కార్యాలయం తెలిపింది. ఈ పరిస్థితి తొలగించేందుకు అగ్నిమాపక దళం, ఒడిశా విపత్తు స్పందన దళం మరియు ఒడిశా అటవీ అభివృద్ధి కార్పొరేషన్ సిబ్బందిని కార్యాచరణకు నియమించారు. వీరి సత్వర చర్యతో నగర వ్యాప్తంగా రహదారి దిగ్బంధ తొలగి రవాణా యథాతథంగా పునరుద్ధరింబడిందని అదనపు ప్రత్యేక రిలీఫ్ కమిషనర్ తెలిపారు.

పర్లాకిమిడిలో భారీ వర్షం

పర్లాకిమిడి: మండువేసవిలో వరుణుడు కరుణించాడు. సోమవారం పగలంతా భగభగమండిపోయిన భానుడు సాయంత్రానికి శాంతించాడు. జిల్లా కేంద్రం పర్లాకిమిడిలో సాయంత్రం ఐదు గంటల సమయంలో వాతావరణంలో ఒక్కసారిగా వాతావరణలో మార్పులు చోటుకున్నాయి. గాలివానతో భారీ వర్షం కురిసింది. పట్టణంలో అరగంట సేపు భీకరగాలులలతో కూడిన వర్షం కురిసింది. దీంతో పలు చోట్ల చెట్లు వరిగిపడ్డాయి. కరెంటు సరఫరా నిలిచిపోయింది. స్థానిక ఉపకారాగారం వద్ద వర్షం ధాటికి డ్రైనేజీలు నిండిపోయి రోడ్డు మీదకు వర్షం నీరు చేరడంతో వాహనదారులు అవస్థపడ్డారు. అధిక ఎండలు, ఉక్కబోతతో సతమతమౌతున్న ప్రజలకు ఈ వర్షంతో ఉపశమనం కలిగింది.



ప్రధాన రహదారిపై విరిగి పడిన చెట్ల తొలగిస్తున్న సిబ్బంది



కలెక్టరేట్ వద్ద రోడ్డుపై వర్షం నీరు



పర్లాకిమిడి ఉపకారాగారం వద్ద రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు



పర్లాకిమిడిలో కురుస్తున్న వర్షం

క్లుప్తంగా

పోలింగ్ కేంద్రాల వద్ద ప్రథమ చికిత్సాకేంద్రాలు

• డీఎంహెచ్‌ఓ భాస్కరరావు



డీఎంహెచ్‌ఓ భాస్కరరావు

విజయనగరం ఫోర్ట్: సాధారణ ఎన్నికల ప్రక్రియలో భాగంగా ఏడు నియోజకవర్గాల్లోని 1847 పోలింగ్ కేంద్రాల వద్ద ప్రథమ చికిత్స కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు డీఎంహెచ్‌ఓ ఎస్. భాస్కరరావు తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, పోలింగ్ కేంద్రాలకు సామగ్రి అందజేసే కేంద్రాల వద్ద 12వ తేదీన.. పోలింగ్ కేంద్రాల వద్ద 13వ తేదీన చికిత్సా కేంద్రాలు ఏర్పాటు చేస్తామన్నారు. అదేవిధంగా స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద 13వ తేదీ సాయంత్రం శిబిరాలు ఉంటాయని తెలిపారు. ఇదిలా ఉంటే ఎన్నికల నేపథ్యంలో వైద్యారోగ్యశాఖ సిబ్బందికి ఈ నెల 11 నుంచి 15 వరకు ఎటువంటి సెలవులు మంజూరు చేయమన్నారు.

పీహెచ్‌సీలో సాధారణ ప్రసవాలు జరిగేలా దృష్టి

• డీఎంహెచ్‌ఓ కె.విజయపార్వతి



బందలుప్పి పీహెచ్‌సీని తనిఖీ చేస్తున్న డీఎంహెచ్‌ఓ కె.విజయపార్వతి

పార్వతీపురం టౌన్: పీహెచ్‌సీల్లో సాధారణ ప్రసవాలు జరిగేలా దృష్టి సారించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారిణి డాక్టర్ కె. విజయపార్వతి అన్నారు. ఈ మేరకు ఆమె పార్వతీపురం మండలంలోని డోకిశీల, బందలుప్పి పీహెచ్‌సీలను సోమవారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడ జరుగుతున్న కాన్పుల రిజిస్టర్‌ను తనిఖీ చేశారు. ల్యాబొరేటరీ, వ్యాక్సిన్, మందుల నిల్వలు పరిశీలించారు. అనంతరం పీహెచ్‌సీలో సిబ్బందితో మాట్లాడుతూ సాధారణ కాన్పులు జరిగేలా దృష్టి సారించాలని ఆదేశించారు. అక్కడి రోగులతో మాట్లాడి వారి ఆరోగ్య సమస్యలు తెలుసుకున్నారు. వడదెబ్బ, డీహైడ్రేషన్ సమస్యలు తలెత్తకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఓఆర్ఎస్ అన్ని గ్రామాల్లో అందుబాటులో ఉంచాలని, టీకా కార్యక్రమాలను గ్రామాల్లో త్వరగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఆశ కార్యకర్తలు వారి పరిధిలో ఉన్న గర్భిణులు, బాలింతల ఆరోగ్య జాగ్రత్తల గురించి ఫోన్ 0124441660 నంబర్ నుంచి వచ్చే కిల్కారీ సందేశాన్ని వినేలా పర్యవేక్షణ చేయాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ శ్రీకాంత్, డాక్టర్ ఐశ్వర్య, డా. కౌశిక్, డెమో యోగీశ్వరరెడ్డి, సూపర్‌వైజర్స్ జయగౌడ్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కోడ్ ఉల్లంఘన కాదా?

• ఓటర్లకు టీడీపీ ప్రలోభాలు?



మాక్ ఈవీఎంలను పట్టుకుని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో తిరుగుతున్న టీడీపీ నాయకుడు

సాలూరు: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద ఫెసిలిటేషన్ కేంద్రంలో ఎన్నికల విధుల్లో పాల్గొనే ప్రభుత్వ ఉద్యోగులు, సిబ్బంది సోమవారం తమ ఓటు హక్కును వినియోగించుకుంటున్న వేళ కొందరు టీడీపీ నాయకులు ఓటర్లను ప్రలోభాలకు గురిచేసేలా వ్యవహరించారు. అక్కడ వేసిన టెంట్లలో కూర్చుని, టీడీపీ అభ్యర్థికి ఓట్లు వేయాలంటూ పార్టీ గుర్తు కనిపించేలా మాక్ ఈవీఎంలను వెంటపట్టుకుని తిరిగారు. తమదైన శైలిలో ప్రలోభాలకు గురిచేసేందుకు ప్రయత్నించారు.ఇది కోడ్ ఉల్లంఘన కిందికి వస్తుందా? రాదా? అని ఎన్నికల అధికారులు పరిశీలించి, తగు చర్యలు తీసుకోవాలని పలువురు ఓటర్లు అక్కడ మాట్లాడుకోవడం తారసపడింది.

ఘాట్ రోడ్లలో భారీ వాహనాల రాకపోకలు నిషేధం

- ఈనెల 10 నుంచి 14 వరకు అమలు
- జిల్లా ఎన్నికల అధికారి విజయసునీత

సాక్షి,పాడేరు (అల్లూరి సీతారామరాజు జిల్లా): జిల్లాలోని ఘాట్ రోడ్లలో ఈనెల 10 నుంచి 14వ తేదీ వరకు భారీ వాహనాల రాకపోకలను నిషేధిస్తున్నట్టు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎం.విజయసునీత సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 13న సార్వత్రిక ఎన్నికల పోలింగ్ దృష్ట్యా సిబ్బంది, సామగ్రిని తరలించేందుకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా రెవెన్యూ, పోలీసు, ఆర్అండ్‌బీ శాఖలు ముందస్తు చర్యలు చేపట్టినట్టు ఆమె పేర్కొన్నారు. విజయనగరం జిల్లాలోని బొడ్డవర నుంచి అనంతగిరి, రకులోయ మీదుగా పాడేరు జాతీయ రహదారి, వడ్డాది-పాడేరు ఘాట్ రోడ్డు, లంబసింగి, మారేడుమిల్లి-భద్రాచలం ఘాట్‌రోడ్ల మార్గాల్లో భారీ వాహనాల రాకపోకలపై నిషేధం ఉంటుందన్నారు. ఈ రోడ్లపై భారీ వాహనాలు, మల్టీ ఎక్సెల్ సిమెంట్, స్టీల్ రవాణా చేసే వాహనాల రాకపోకలను ఆయా తేదీల్లో నిషేధిస్తున్నామని తెలిపారు. వాహనదారులంతా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని కలెక్టర్ విజయసునీత సూచించారు.

ఆశల జీవితాల్లో వేతన వెలుగులు

- ఆశ వర్కర్ల జీతాలు పెంచిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం
- చంద్రబాబు హయాంలో కార్యకర్తల జీతం రూ. 3 వేలు
- జగనన్న హయాంలో రూ. పది వేలకు పెంపు
- జిల్లాలో 1785 ఆశ వర్కర్లకు మేలు



గర్భిణిని ఆస్పత్రికి తరలిస్తున్న ఆశ వర్కర్లు (ఫైల్)

విజయనగరం ఫోర్ట్: చంద్రబాబు హయాంలో ఆశ వర్కర్లు ఎన్నో అవస్థలు పడ్డారు. చాలీచాలని పారితోషికాలతో కుటుంబాలను నెట్టుకురావడానికి పడరాని కష్టాలు పడ్డారు. అటువంటి సమయంలో ప్రతిపక్ష నేత హోదాలో పాదయాత్ర చేసిన జగన్ మోహన్‌రెడ్డి ఆశ వర్కర్ల ఇబ్బందులను దగ్గరనుండి చూశారు. అధికారంలోకి రాగానే జీతాలు పెంచుతామని హామీ ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం అధికారంలోకి రాగానే ఆశ వర్కర్ల జీతాల పెంపు ఫైల్‌పైనే మొదటి సంతకం చేశారు. వారు కూడా ఊహించని విధంగా రూ. 3 వేల నుంచి పది వేల రూపాయలకు జీతం పెంచారు. జీతాలు పెంచాలని టీడీపీ హయాంలో ఆశ వర్కర్లు ఎన్నో పోరాటాలు చేసినా ఫలితం లేకపోయింది.

1785మందికి లబ్ధి..

జిల్లాలో 1785 మంది ఆశ వర్కర్లు ఉన్నారు. వీరందరూ 2005 నుంచి విధులు నిర్వహిస్తున్నారు. ఒక్కసారిగా జీతం రూ.3 వేల నుంచి 10 వేల రూపాయలకు పెరగడంతో సమాజంలో గౌరవంగా జీవిస్తున్నామని పలువురు ఆనందంతో చెప్పారు. టీడీపీ హయాంలో ఆశ కార్యకర్తలకు పనికి తగ్గ పారితోషికం ఇచ్చేవారు. దీంతో ఒక్కో కార్యకర్తకు ఒక్కోలా జీతం వచ్చేంది. కొంతమంది రూ. వెయ్యి వస్తే మరికొంత మంది రూ.1500, రూ. 2000 వచ్చేది. అతి కొద్దిమందికి మాత్రమే మూడు వేల రూపాయలు వచ్చేది.

పారితోషికాల్లోనూ కోత...

చంద్రబాబు హయాంలో ఆశ వర్కర్లకు ఇచ్చే పారితోషికం అంతంతమాత్రమే. ఇచ్చే పారితోషికాల్లోను కోత విధించారు. ఆశ వర్కర్లు గర్భిణుల వివరాలు సేకరించడం.. టీకాలు వేయడం.. ప్రసవాలకు ఆస్పత్రులకు తీసుకెళ్లడం.. గర్భిణులకు ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు నిర్వహించడం.. నవజాత శిశువులను పర్యవేక్షించడం.. క్షయ , కుష్టు రోగులకు మందులు అందించడం.. సీజనల్ వ్యాధులు ప్రబలినప్పుడు వైద్యాధికారులకు సమాచారం ఇవ్వడం వంటి విధులు నిర్వహిస్తారు. గర్భిణి నమోదుకు రూ. 300 వచ్చేవారు. దీన్ని చంద్రబాబు సర్కారు రూ. 150కి తగ్గించింది. అలాగే టీకాలు వస్తే రూ. 500 ఇవ్వాల్సి ఉండగా దాన్ని రూ. 250కు.. సమావేశాలకు హాజరైతే రూ. 300కు గాను రూ.150.. ప్రసవాలకు తీసుకెళ్తే రూ. 500కు గాను 250 రూపాయలు ఇచ్చేవారు. అన్నింటిలోనూ సగానికి సగం కోత విధించడంతో ఆశ కర్యకర్తలు ఇబ్బందులు పడ్డారు.

ఒక్కసారిగా రూ. పది వేలు

మూడు వేల రూపాయల గౌరవ వేతనంతో ఇబ్బంది పడుతున్న ఆశ కార్యకర్తలకు ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి చల్లని కబురు అందించారు. జీతాన్ని మూడు రెట్లు పెంచి ఒక్కసారిగా పది వేల రూపాయలు చేయడంతో సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి. ప్రస్తుతం ప్రతి ఆశ కార్యకర్త మోములో చిరునవ్వు తొణికిసలాడుతోంది.

చంద్రబాబువి నీచ రాజకీయాలు



భైరిపురంలో మంత్రి బొత్స ఎన్నికల ప్రచారం

- భైరిపురం, ఉత్తరావల్లి, బుదరాయవలస ఎన్నికల సభల్లో మంత్రి బొత్స సత్యనారాయణ



ఉత్తరావల్లి ఎన్నికల ప్రచార సభలో మాట్లాడుతున్న మంత్రి బొత్స సత్యనారాయణ

మెరకముడిదాం: పేదవారి ఆకలితో తెలుగుదేశం పార్టీ నాయకులు నీచ రాజకీయాలు చేస్తున్నారని, అటువంటివి మానుకోవాలని మంత్రి బొత్స సత్యనారాయణ హితవు పలికారు. మండలంలోని భైరిపురం, ఉత్తరావల్లి, బుదరాయవలస గ్రామాల్లో జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావుతో కలిసి సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వృద్ధులు, వికలాంగులు, వితంతువులకు ఇస్తున్న పింఛన్లపై తెలుగుదేశం నాయకులు చేసిన రాజకీయ కుట్ర ఫలితంగా రాష్ట్ర వ్యాప్తంగా 28 మంది మృతి చెందారన్నారు. భైరిపురం గ్రామంలో సచివాలయ భవనాన్ని అభివృద్ధి చేయడంతో పాటు రైతుభరోసా కేంద్రం, వెల్‌నెస్ సెంటర్లను కొత్తగా నిర్మించుకున్నామన్నారు. ఉత్తరావల్లి గ్రామసభలో ఆయన మాట్లాడుతూ.. రూ. 2 కోట్లతో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేసుకున్నామని చెప్పారు. 2019కి ముందు ఐదు సంవత్సరాలు అధికారంలో ఉన్న తెలుగుదేశం పార్టీ నాయకులు మెరకముడిదాం మండలానికి ఏం చేశారో చెప్పాలన్నారు.

ఎన్నికలప్పుడు వచ్చే వారిని నమ్మొద్దు : జెడ్పీ చైర్మన్ శ్రీనివాసరావు

ఎన్నికల సమయంలోనే టీడీపీ నాయకులు గ్రామాలకు వస్తుంటారని, అటువంటి వారిని నమ్మవద్దని జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. భైరిపురం, ఉత్తరావల్లి, బుదరాయవలస గ్రామాలను అన్ని విధాలా అభివృద్ధి చేసుకున్నామని తెలిపారు. అభివృద్ధి చేశాం కాబట్టే గ్రామాల్లో తిరిగి ఓట్లు అడుగుతున్నామని.. టీడీపీ నాయకులు ఏ ముఖం పెట్టుకుని ఓట్లు అడుగుతున్నారని ప్రశ్నించారు. అనేక సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి పొందిన ప్రజలు విజ్ఞతతో వ్యవహరించి చీపురుపల్లి ఎమ్మెల్యేగా బొత్స సత్యనారాయణను, విజయనగరం ఎంపీగా బెల్లాన చంద్రశేఖర్‌ను గెలిపించాలని కోరారు.

జగనన్న మళ్లీ ముఖ్యమంత్రి కావాలి : ఎంపీ బెల్లాన

సంక్షేమ ఫలాలు మళ్లీ అందుకోవాలంటే జగన్ మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాలని ఎంపీ అభ్యర్థి బెల్లాన చంద్రశేఖర్ అన్నారు. బుదరాయవలసలో ఆయన మాట్లాడుతూ, సంక్షేమ పథకాలతో పేద, బడుగు, బలహీన వర్గాలు లబ్ధి పొందాయన్నారు. మే 13న జరగనున్న ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఫ్యాన్ గుర్తుకు ఓటెయ్యాలని కోరారు. కార్యక్రమాల్లో డీసీఎంఎస్ చైర్మన్ ఎస్వీ రమణరాజు, తాడ్డి వేణుగోపాలరావు, కోట్ల విశ్వేశ్వరరావు, బూర్లె నరేష్‌కుమార్, వైస్ ఎంపీపీలు తలచుట్ల హరిబాబు, కందుల పార్వతి, మూడు గ్రామాల సర్పంచ్‌లు పప్పల విజయ, సారిక తమ్మినాయుడు, కిల్లాడ విజయ, పప్పల కృష్ణమూర్తి, పప్పల గ్రహణేశ్వరరావు, మండల సత్యనారాయణ, బాలి బంగారునాయుడు, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు



రోడ్డు ప్రమాదంలో గాయపడిన బాధితులు

రాజాం సిటీ: మండల పరిధి గురవాం గ్రామ సమీపంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు వ్యక్తులు గాయపడ్డారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రాజాం నుంచి పాలకొండ వెళ్తున్న ఆటోను డోలపేటకు చెందిన గోవింద్ ద్విచక్రవాహనంపై వస్తూ వెనుక నుంచి ఢీ కొట్టాడు. ఈ ప్రమాదంలో ఆటో అదుపుతప్పి పక్కకు పడిపోగా సారధి గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ బి.మురళితో పాటు అందులో ప్రయాణిస్తున్న పాలకొండ మండలం తంపటాపల్లికి చెందిన పకీరు, వీరఘట్టం మండలం నందివాడకు చెందిన చందు గాయపడ్డారు. ద్విచక్రవాహనదారుడు గోవింద్‌కు కూడా గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు స్పందించి క్షతగాత్రులను 108 వాహనం ద్వారా రాజాం సామాజిక ఆస్పత్రికి తరలించారు. ఆటో డ్రైవర్ మురళి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై ఎస్. భాస్కరరావు తెలిపారు.

సెంచూరియన్‌లో వక్తృత్వ పోటీలు



వక్తృత్వ పోటీల్లో ప్రసంగిస్తున్న విద్యార్థి, వేదికపై న్యాయ నిర్ణేతలు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని టెక్కలి సెంచూరియన్ విశ్వ విద్యాలయంలో ఓటింగ్ ఫర్ గుడ్ గవర్నెన్స్ అనే అంశంపై సోమవారం వక్తృత్వ పోటీలు నిర్వహించారు. సీసీసీడీసీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీల్లో బీఎస్సీ అనస్తీషియా విద్యార్థి వహీదా మొదటి బహుమతి, నిఖిల్ రెండో బహుమతి, ప్రజ్ఞ మూడో బహుమతి సాధించారు. విజేతలను వీసీ పీకే మహంతి, రిజిస్ట్రార్ పల్లవి అభినందించారు. కార్యక్రమంలో సిబ్బంది దేవికారాణి, నూకరాజు, విజయ్‌బాబు, మోహన్‌బాబు, బెనర్జీ, తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎన్నికల భారతం కవితా సంకలనం ఆవిష్కరణ

విజయనగరం టౌన్: అభ్యుదయ రచయితల సంఘం జిల్లాశాఖ ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం స్థానిక గురజాడ స్వగృహంలో ఎన్నికల భారతం కవితా సంకలనం ఆవిష్కరించనున్నట్లు అరసం జిల్లా ప్రతినిధి జీఎస్.చలం సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సాహితీవేత్తలు, అభిమానులు హాజరుకావాలని కోరారు.

సంక్షేమ పాలన మెచ్చి...

- వైఎస్సార్‌సీపీలోకి వలసల జోరు..
- కండువాలు వేసి ఆహ్వానిస్తున్న నాయకులు
- కుదేలవుతున్న ప్రతిపక్షాలు



టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల

విజయనగరం: వైఎస్సార్‌సీపీ సంక్షేమ పాలనకు మెచ్చి ప్రతిపక్ష పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు వైఎస్సార్‌సీపీలో చేరుతున్నారు. కొద్ది రోజుల్లో ఎన్నికలున్న నేపథ్యంలో చేరికలు జోరందుకోవడంతో వైఎస్సార్‌సీపీ బలపడుతుండగా... ప్రతిపక్ష టీడీపీ, జనసేన పార్టీలు కుదేలవుతున్నాయి. విజయనగరం మండలంలోని గుండాలపేట గ్రామానికి చెందిన 25 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో సోమవారం చేరాయి. వీరందరికీ ఎమ్మెల్యే అభ్యర్థి కోలగట్ల వీరభద్రస్వామి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. గ్రామానికి చెందిన వాసు, పిసిని లక్ష్మి, కంది రామకృష్ణ, చందక రాజు, తదితర 25 కుటుంబాల వారు పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీపీ మామిడి అప్పలనాయుడు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు నడిపేన శ్రీనివాసరావు మాట్లాడుతూ, పార్టీలో చేరికలే రేపటి ఎన్నికల్లో విజయానికి బలమన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు కెల్ల శ్రీనివాసరావు, కంది బాలకృష్ణ, పిసిని ప్రభావతి, పద్మ, కంది ఆదిలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

జనసేనకు షాక్...!

నెల్లిమర్ల రూరల్: నెల్లిమర్లలో జనసేన పార్టీకి షాక్ తగిలింది. ఆ పార్టీ మండల ఉపాధ్యక్షుడు కొత్తూరు లక్ష్మణరావుతో పాటు పూతికపేటకు చెందిన మరో 50 కుటుంబాలు జనసేనను వీడి వైఎస్సార్‌సీపీలో చేరాయి. వారందరికీ మొయిదలో ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్‌బాబు పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కొత్తూరు లక్ష్మణరావు మాట్లాడుతూ.. పార్టీ కోసం కష్టపడిన వారికి జనసేనలో గుర్తింపు లేదన్నారు. బీసీలను విస్మరించి స్థానికంగా లేని లోకం మాధవికి టిక్కెట్ ఇవ్వడం అన్యాయమన్నారు. వైఎస్సార్‌సీపీతో బీసీ సాధికారత సాధ్యమని నమ్మి పార్టీలోకి వచ్చామని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు చనమళ్ల వెంకటరమణ, జెడ్పీటీసీ సభ్యుడు గదల సన్యాసినాయుడు, వైస్ ఎంపీపీ పతివాడ సత్యనారాయణ, మహిళ నాయకురాలు పతివాడ కృష్ణవేణి, సర్పంచ్ లెంక గోవింద, చనమళ్ల తులసి, తదితరులు పాల్గొన్నారు.



వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స, తదితరులు

పోక్సో కేసులో ముద్దాయికి జైలు శిక్ష

విజయనగరం క్రైమ్: రూరల్ పోలీస్ స్టేషన్‌లో 2020లో నమోదైన పోక్సో కేసులో నేరం రుజువు కావడంతో ముద్దాయికి న్యాయమూర్తి కె.నాగమణి 20 ఏళ్ల కఠిన కారాగార శిక్ష, రూ. 2,500 జరిమానా విధిస్తూ సోమవారం తీర్పు చెప్పారని విజయనగరం రూరల్ సీఐ ఎం.శ్రీనివాసరావు తెలిపారు. వివరాల్లోకి వెళితే.. మండల పరిధిలోని ద్వారపూడి గ్రామానికి చెందిన కళ్లేపల్లి అప్పారావు (61) అనే వ్యక్తి ఐదేళ్ల చిన్నారిపై లైంగిక దాడికి పాల్పడినట్లు బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు రూరల్ పోలీస్‌స్టేషన్లో 2020 జనవరిలో అప్పటి ఎస్సై ప్రసన్నకుమార్ కేసు నమోదు చేశారు. ఎస్సీ, ఎస్టీ సెల్ -1 డీఎస్పీ బి.మోహనరావు దర్యాప్తు చేపట్టి నిందితుడ్ని అరెస్టు చేసి న్యాయస్థానంలో ప్రవేశపెట్టారు. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి నాగమణి ముద్దాయికి జైలుశిక్ష, జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. పోలీసుల తరఫున స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ మావూరి శంకరరావు వాదనలు వినిపించగా.. ప్రస్తుత డీఎస్పీ ఆర్.గోవిందరావు పర్యవేక్షణలో రూరల్ సీఐ ఎం.శ్రీనివాసరావు, ఎస్సై ఆర్.వాసుదేవ్, కోర్టు ఉమెన్ కానిస్టేబుల్ టి.లక్ష్మి, సీఎంఎస్ హెచ్‌సీ రామకృష్ణ సాక్షులను సకాలంలో కోర్టులో హాజరుపర్చారు.

టీడీపీకి భారీ షాక్..



పార్టీలో చేరినవారితో ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్

రేగిడి : మండలంలో నాయిరాలవలస పంచాయతీ పరిధిలోని రాజావలసలో టీడీపీకి భారీ షాక్ తగిలింది. ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ సమక్షంలో 30 టీడీపీ కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరాయి. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలనకు ఆకర్షితులమై పార్టీలో చేరినట్లు వారాడ సాయికుమార్, మక్క సూర్యనారాయణ, మక్క శ్రీనివాసరావు, ఉసిడి గంగునాయుడు, రమణ, మక్క నారాయణరావు, తదితరులు అన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ గేదెల వెంకటేశ్వరరావు, వైస్ ఎంపీపీ టంకాల అచ్చెన్నాయుడు, పార్టీ మండల కన్వీనర్ వావిలపల్లి జగన్ మోహనరావు, మక్క వెంకటరమణ, మక్క చిన్నంనాయుడు, వావిలపల్లి వెంకటరమణ, ఎంపీటీసీ మాజీ సభ్యుడు కొవ్వాడ శ్రీరాములు, రుంకు గణపతి, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ, జనసేన నాయకులు




జనసేన నాయకుడికి కండువా వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ తలే రాజేష్

రాజాం సిటీ: మున్సిపాలిటీ పరిధి పొనుగుటివలస గ్రామంలోని టీడీపీ, జనసేన కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరుతున్నాయి. ఇప్పటికే గ్రామంలోని 80 కుటుంబాలు ఎమ్మెల్యే అభ్యర్థి తలే రాజేష్ ఆధ్వర్యంలో పార్టీలో చేరగా.. తాజాగా మరో 70 కుటుంబాలు పార్టీ తీర్థం పుచ్చుకున్నాయి. జనసేన నాయకుడు సామంతుల ప్రసాద్‌తో పాటు ఆయన అనుచరులు రాజేష్ సమక్షంలో పార్టీ కండువా కప్పుకున్నారు. అలాగే టీడీపీకి చెందిన దేవకివాడ గౌరునాయుడు, మీసాల సూరి, సురవరపు చిన్నంనాయుడు, పొగిరి చిట్టియ్య, కెంబూరు కృష్ణ, కొమరపురి మంగయ్య, యండమూరి రమణ, తదితరులంతా మాజీ సర్పంచ్ శాసపు కేశవరావు ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరినట్లు వారంతా తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పాలవలస శ్రీనివాసరావు, శాసపు వేణుగోపాలనాయుడు, రెడ్డి రమేష్, గార సత్యనారాయణ, శాసపు అప్పలనాయుడు, ఇనుమల శ్రీను, దూబ మహేష్, బాబూరావు, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలోకి పలువురు..

వంగర: మండల పరిధిలోని లక్ష్మీపేట గ్రామంలో టీడీపీకి చెందిన 20 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరాయి. వీరికి రాజాం ఎమ్మెల్యే అభ్యర్థి తలే రాజేష్, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో నివర్తి అనిల్‌కుమార్, కలమటి రాము, కలమటి గంగులు, కలమటి ముత్యాలు, కలమటి సత్యవతి, కలమటి ప్రకాశం, తదితరులున్నారు.

పింఛన్ అందలేదన్న బెంగతో వృద్ధుడి మృతి





పైడయ్య మృతదేహం,
(ఇన్‌సెట్లో) ముచ్చ పైడయ్య (ఫైల్)

మెరకముడిదాం: టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు, నిమ్మగడ్డ రమేష్ ఎన్నికల సంఘానికి చేసిన ఫిర్యాదు ఫలితం మరో వృద్ధుడిని బలితీసుకుంది. పింఛన్ అందలేదన్న బెంగతో మెరకముడిదాం మండలం రామాయవలస సచివాలయం పరిధిలోని ముచ్చ పైడయ్య (72) అనే వృద్ధుడు చనిపోయాడు. బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. పైడియ్యకు భార్య, పిల్లలు లేరు. కొన్నేళ్లుగా సోమలింగాపురంలో నివసిస్తున్న ఆయన వదిన కుమారుడు తవుడు వద్ద ఉంటున్నాడు. ఆయనకు ప్రతినెలా ప్రభుత్వం మంజూరు చేసిన రూ.3వేలు పింఛన్‌ను వలంటీరు ఇంటికి తెచ్చి అందించే వాడు. మే నెల పింఛన్ డబ్బులు మెరకముడిదాంలోని ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంకు (ఏపీజీవీబీ)లోని ఆయన ఖాతాకు జమయ్యాయి. దీనికోసం నాలుగు రోజులుగా తిరుగుతున్నాడు. బ్యాంకు ఖాతా స్తంభించిపోవడంతో వేలిముద్రలు వేయాల్సి వచ్చింది. ఆయన వేలిముద్రలు సరిగా నమోదుకాకపోవడంతో పింఛన్ డబ్బులు చేతికి అందలేదు. బ్యాంకు, సచివాలయ సిబ్బంది ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. పింఛన్ మరి అందదేమోనంటూ గ్రామస్తులు, వదిన కుమారుడు వద్ద తరచూ వాపోయాడు. పింఛన్ అందుతుందని ధైర్యం చెప్పినా మనస్థాపానికి గురై ఆదివారం అర్ధరాత్రి పైడయ్య మృతిచెందినట్టు బంధువులు తెలిపారు.

స్కూటీ దగ్ధం

సాలూరు: పట్టణంలోని డబ్బివీధి మామిడిపల్లి రోడ్డు పక్కన ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ పేలి అగ్నిప్రమాదం సంభవించడంతో ఓ స్కూటీ కాలిపోయింది. దీనిపై అగ్నిమాపక శాఖ అధికారి సుధాకరరావు తెలిపిన వివరాల ప్రకారం..సోమవారం మధ్యాహ్నం డబ్బివీధి మామిడిపల్లి రోడ్డు పక్కన గల 160 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ పేలి, మంటలు చెలరేగాయి.ఈ అగ్నిప్రమాదంలో సమీపంలో ఉన్న స్కూటీ కాలిపోయింది. ఈ సమాచారం తెలుసుకున్న అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి వెళ్లి మంటలు అదుపుచేశారు. పేలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్ విలువ సుమారు రూ.17 లక్షలు ఉంటుందని ఎలక్ట్రికల్ ఎ.డి రంగారావు తెలిపారు.